

హాజరుపై నజర్

టీజీ ఎన్పీడీసీఎల్‌లో ఉద్యోగ సంఘాల నాయకుల హాజరుపై యాజమాన్యం దృష్టి సారించింది. టీజీ ట్రాన్స్‌కో జేఎండీ, టీజీ ఎన్పీడీసీఎల్‌కు ఫిర్యాదులు అందాయి.

- 8లో ▸



కుళ్లిన మాంసం ముద్దలు..

హనుమకొండలో పేరుగాంచిన మూడు హోటళ్లలో గురువారం అధికారులు తనిఖీలు చేపట్టగా కళ్లు బైర్లు కమ్మే నిజాలు వెలుగు చూశాయి.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం

$42^0/31^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఎండ ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోతతోపాటు వేడి ఉంటుంది. రాత్రి వేళ ఆహ్లాదకరంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సైకిల్‌పై భద్రాచలానికి..



దుగ్గొండి: మండలంలోని గిర్నిబావి గ్రామానికి చెందిన హనుమాన్ భక్తుడు మాటూరి ప్రశాంత్ భద్రాచలానికి సైకిల్‌పై గురువారం బయలుదేరి వెళ్లాడు. 41 రోజులుగా హనుమాన్ దీక్షలో ఉన్న ప్రశాంత్ ఇరుముడి కట్టుకుని సైకిల్‌పై యాత్ర ప్రారంభించాడు. తాను భద్రాచలంలో శ్రీరాముడిని దర్శించుకున్న అనంతరం మాల విరమణ చేస్తానని ప్రశాంత్ తెలిపాడు. ఈమేరకు గ్రామస్తులు, భక్తులు అభినందించి ఆశీర్వదించారు.

ఇంటర్ పరీక్షలకు 169 మంది గైర్హాజరు

కాశీబుగ్గ సెంటర్: జిల్లాలో గురువారం జరిగిన ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు 169మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి కె.మాధవరావు తెలిపారు. మొదటి సంవత్సరం పరీక్షకు 1,867 మంది విద్యార్థులకు 1750 మంది, రెండో సంవత్సరం పరీక్షకు 876 మంది విద్యార్థులకు 824 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు.

తాటివనం దగ్ధం



సంగెం: నిప్పంటుకుని తాటివనం దగ్ధమైన ఘటన మండల కేంద్రంలో జరిగింది. స్థానికులు, బాధిత గీతకార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలో సుమారు 20 ఏళ్ల క్రితం రెండు ఎకరాల భూమిలో తాటి, ఈత చెట్లను గీత కార్మికులు జీవనోపాధి కోసం పెంచుకున్నారు. గీతకార్మికులు కొన్ని కొన్నేళ్లుగా చెట్లకు కల్లు గీస్తున్నారు. గురువారం ఉదయం 11 గంటల ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టగా తాటి, ఈత వనం మొత్తం అగ్నికి ఆహుతైంది. గీత వృత్తితో బతుకుతున్న గీత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరారు.

ద్విచక్రవాహనం ఢీ.. ఇద్దరికి గాయాలు

ఖానాపురం: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన మండల కేంద్రం శివారులో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మరావుపేటకు చెందిన కోరె రాజన్న తన భార్యతో కలిసి ద్విచక్రవాహనంపై ఖానాపురం నుంచి ధర్మరావుపేటకు వెళ్తున్నాడు. బుధరావుపేటకు చెందిన బానోత్ మంగీలాల్ నడుచుకుంటూ ఖానాపురం వస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు మంగీలాల్‌ను ద్విచక్రవాహనం ఢీకొట్టింది. దీంతో ఆయనకు కాలు విరగగా రాజన్నకు తలకు గాయాలయ్యాయి. అటువైపు వెళ్తున్న ఎస్సై రఘుపతి వెంటనే క్షతగాత్రులను చికిత్స కోసం నర్సంపేట పట్టణంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

శతాధిక వృద్ధురాలి మృతి



చెన్నారావుపేట: మండల కేంద్రానికి చెందిన శతాధిక వృద్ధురాలు రాసమల్ల శాంతమ్మ (102) అనారోగ్యంతో గురువారం మృతి చెందింది. ఆమెకు ముగ్గురు కుమార్తెలు, నలుగురు కుమారులు ఉన్నారు. ఈమె సంతానానికి కలిగిన పిల్లలు మొత్తం 56 మంది ఉన్నట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. శాంతమ్మ మృతికి పలువురు గ్రామస్తులు సంతాపం తెలిపారు.

మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలి



గీసుకొండ: మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలని ఫిషరీస్ సొసైటీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పిట్టల రవీందర్ అన్నారు. కొనాయమాకుల రైతు వేదికలో ప్రకృతి పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మత్స్య సహకార సంఘాల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రూ. 20 వేల కోట్లతో ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ప్రకృతి పర్యావరణ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు బేఖాతర్

జిల్లా బాలల సంరక్షణ దత్తత విభాగం తీరుతో ఆగమాగం

- సకాలంలో సమర్పించని గృహ సందర్శన నివేదికలు
- పిల్లలను పోషించే సీనియార్టీ కోల్పోతున్న దంపతులు
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు



జిల్లా బాలల సంరక్షణ విభాగం కార్యాలయం

సాక్షి, వరంగల్: 'కడుపున మోయకున్నా గుండెల్లో దాచుకుని పెంచుకుంటున్నాం.. పేగుబంధం కాకున్నా కంటి పాపలా చూసుకున్నాం.. దయచేసి మా బిడ్డను తీసుకెళ్లొద్దంటూ అక్రమ పద్ధతిలో పిల్లలను కొనుగోలు చేసిన దంపతులు ఇటీవల రాచకొండ పోలీసులకు మొరపెట్టుకున్నారు. చట్టబద్ధంగా పిల్లలను దత్తత తీసుకోవాలని రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్‌జోషి అన్నారు. చట్టబద్ధంగా దత్తత తీసుకునేందుకు ముందుకొస్తున్న వారు మాత్రం కొందరు అడాప్షన్ అధికారుల తీరుతో విసుగెత్తిపోతున్నారు. ఈ కోవలోకే వస్తుంది జిల్లా బాలల సంరక్షణ విభాగంలోని అడాప్షన్ సెక్షన్ తీరు. ఈ అధికారుల తీరుతో అక్రమ పద్ధతిలోనే దత్తతకు చాలామంది మొగ్గు చూపుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. చట్టపరమైన రీతిలో దత్తతకు ముందుకొస్తే సమయానికి గృహ సందర్శన నివేదికలు ఇవ్వడం లేదు. దీంతో వారు పిల్లలను పోషించుకునే సినీయారిటీ కోల్పోతున్నారు.

గృహ సందర్శన నివేదిక పంపించకుండా తాత్సారం..

బాలల న్యాయ చట్టం-2015 ప్రకారం కేంద్ర మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ (కారా) ద్వారా బాలలను దత్తత తీసుకునేందుకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కారా.నిక్.ఇన్‌ను అందుబాటులోకి తెచ్చింది. దంపతుల వయసు నిర్ధారణను బట్టి అర్హత గల శిశువులను దత్తత ఇస్తారు. శిశువుల దత్తత కోసం దంపతులు చేసుకున్న దరఖాస్తును పరిశీలించి గృహ సందర్శన (హోం స్టడీ) నివేదికను సిద్ధం చేసి కారా వెబ్‌సైట్ డేటాలో నమోదు చేస్తారు.

ఈ నివేదిక మూడు సంవత్సరాల కాలపరిమితి ఉంటుంది. ఈలోగా శిశువును దత్తత తీసుకోకుంటే మళ్లీ మూడు సంవత్సరాల అనంతరం వారికిచ్చే లాగిన్ ఐడీ ద్వారా గృహ సందర్శన నివేదికను రెన్యూవల్ చేయాలని, తిరిగి నిర్వహించాలని, రీవ్యాలిడేషన్ చేయాలని అధికారులను విజ్ఞప్తి చేస్తారు. అనంతరం 60 రోజుల్లో నివేదికను తయారుచేసి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. కానీ, అందుకు భిన్నంగా జిల్లా బాలల సంరక్షణ దత్తత సెక్షన్ అధికారి మాత్రం రీవ్యాలిడేషన్ చేసి రెండు సంవత్సరాలు అయినా గృహ సందర్శన నివేదిక పంపకుండా తాత్సారం చేశారు. దీంతో ఆ అధికారి నిర్లక్ష్యం పిల్లలు లేనివారికి శాపంగా మారిందని ఆరోపణలు వస్తున్నాయి.

నిర్లక్ష్యంగా అధికారి సమాధానం

రాయపర్తి మండలానికి చెందిన మురుపోజు రాంబాబు, సవిత దంపతులకు 29 సంవత్సరాల క్రితం వివాహమైంది. 2019లో పాపను దత్తత తీసుకోవాలని భావిస్తే ఈ విషయం తెలుసుకున్న జిల్లా బాలల సంరక్షణ విభాగాధికారులు వచ్చి వారికి కౌన్సెలింగ్ చేశారు. చట్టబద్ధంగా దత్తత తీసుకోవాలని చెప్పడంతో 2019 ఫిబ్రవరి 9న ఆడశిశువు కావాలని కారా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు గృహ సందర్శన నివేదికను సిద్ధం చేసి అప్‌లోడ్ చేశారు. మూడేళ్లు దాటినా శిశువు దత్తత రాకపోవడంతో 2022 డిసెంబర్ 6న గృహ సందర్శన నివేదికను తిరిగి రూపొందించాలని తమ లాగిన్ ద్వారా రీవ్యాలిడేషన్‌కు రిక్వెస్ట్ పంపామని ఆ దంపతులు తెలిపారు. బాలల సంరక్షణ విభాగం నుంచి అడాప్షన్ సెక్షన్ అధికారి సరిత రీవ్యాలిడేషన్ రిక్వెస్ట్ పెట్టిన 60 రోజుల్లోపు గృహ సందర్శన నివేదిక సిద్ధం చేసి అధికారులకు పంపాలి. కానీ, సదరు అధికారి గృహ సందర్శన నివేదిక సిద్ధం చేయలేదు. దీంతో వారు సీనియార్టీ కోల్పోయారు. 'ఇటీవల ఆ అధికారి ఫోన్ చేసి మీకు 4 నుంచి 6 సంవత్సరాల పాప వస్తుందని చెప్పింది. మాకు చిన్న పాప దత్తత కావాలని దరఖాస్తు చేస్తే పెద్ద పాప ఎలా ఇస్తారని అడిగితే నిర్లక్ష్యంగా సమాధానమిచ్చింది. రాంబాబు దంపతులకు దత్తత ఇష్టం లేదని 2024 ఏప్రిల్ 19న కారా అధికారులకు మా అనుమతి లేకుండానే ఈమెయిల్ ద్వారా సమాచారం పంపించారని తెలియడంతో నిర్ఘాంతపోయాం. దత్తత అవసరం లేదని దత్తత సెక్షన్ అధికారి సరిత పై అధికారులకు తప్పుడు ఈమెయిల్ పెట్టారని కలెక్టర్, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ కాంతివెస్లీ, మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాకాటి కరుణ, ఢిల్లీలోని దత్తత అధికారులకు ఈనెల 24న ఫిర్యాదు చేశాం. తమకు అన్యాయం చేసిన అధికారులపై చర్య తీసుకోవాలని, చట్టబద్ధంగా శిశువు దత్తత ఇచ్చేలా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశాం' అని రాంబాబు, సవిత దంపతులు పేర్కొన్నారు.



మురుపోజు రాంబాబు, సవిత దంపతులు

నర్సంపేట మున్సిపాలిటీలో దొంగలు!



నర్సంపేట మున్సిపల్ కార్యాలయం



డీజిల్ ఇంజన్ మాయమైంది ఈ ఫిల్టర్ బెడ్ నుంచే..

- డీజిల్ ఇంజన్, టేకు కలప అపహరణ
- సిబ్బందే అమ్ముకున్నారని ఆరోపణలు

నర్సంపేట: ఇంటి దొంగలను ఈశ్వరుడైనా పట్టుకోలేడనే నానుడి.. కాపాడాల్సిన వారే కాజేశారనే ఆరోపణలు.. విలువైన వాటిని మాయం చేస్తున్న వారు బయటి వారు కాదనేది జగమెరిగిన సత్యం.. అయినా కాపాడాల్సిన అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో నర్సంపేట మున్సిపాలిటీలో ముసుగు దొంగల ఆగడాలు పెరిగిపోతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. 40 వేల జనాభా ఉన్న నర్సంపేట మున్సిపాలిటీలో సౌకర్యాలు కల్పించేందుకు విలువైన పరికరాలను కొనుగోలు చేశారు. అవి పాడైపోయిన పరిస్థితుల్లో కొత్త వాటిని అమర్చుతారు. పాడైపోయిన వాటిని కార్యాలయానికి చేర్చి కాపాడాల్సి ఉంది. కానీ, ఆ పరికరాలు కనిపించకుండా పోతుండడం చర్చనీయాంశంగా మారింది. 10 సంవత్సరాల కాలంలో 6 కొత్త కరెంట్ మోటార్లు, బోరింగ్ పైపులు కొనుగోలు చేసినట్లు కార్యాలయ రికార్డుల ద్వారా తెలుస్తోంది. వాటి స్థానంలో ఉన్న పాతవి మున్సిపల్ కార్యాలయం స్టోర్ రూంలో భద్రపర్చాల్సి ఉన్నా అవి కూడా కనిపించడం లేదని తెలుస్తోంది. దీన్ని బట్టి భారీస్థాయిలోనే మున్సిపాలిటీకి చెందిన సామగ్రి మాయమవుతున్నట్లు సమాచారం. ద్వారకపేట ఫిల్టర్‌బెడ్ వద్ద ఉన్న ఆయిల్ ఇంజన్ కనిపించడం లేదు. పనిచేయడం లేదనే పేరుతో కార్యాలయ సిబ్బందే అమ్ముకున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అంతటి భారీ యంత్రమే కనిపించకుండా మాయమైంది అంటే కార్యాలయంలోని విలువైన విద్యుత్, ఇతర పరికరాల పరిస్థితి ఏవిధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.



మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో కొన్నే మిగిలిన టేకు దుంగలు

విలువైన కలప ఏమైంది..

పట్టణంలోని ఏడో వార్డులో ఉన్న గ్రీన్‌ల్యాండ్ స్థలంలో పెరిగిన విలువైన టేకు వృక్షాలు గత సంవత్సరం భారీ వర్షాలతో కూలిపోయాయి. ఆ కలప కార్యాలయానికి తరలించగా అందులో కొద్ది కలప మాత్రమే కనిపిస్తోంది. మిగిలిన భారీ సైజు దుంగలు మాయమైనట్లు కొంతమంది పేర్కొంటున్నారు. ప్రస్తుతం పట్టణ ప్రకృతి వనం పేరుతో గ్రీన్‌ల్యాండ్ స్థలానికి హద్దులు కేటాయించి వాకింగ్‌ట్రాక్ కూడా ఏర్పాటు చేశారు. విలువైన భారీ సైజులోని చెట్లు సుమారు 8 వరకు కూలి పోయాయి. వాటికి సంబంధించిన కలప దుంగలు కొన్ని మాత్రమే మున్సిపాలిటీ కార్యాలయంలో కనిపిస్తున్నాయి. దీన్ని బట్టి చూస్తే భారీస్థాయిలో టేకు కలప మాయమైనట్లు తెలుస్తోంది. గతంలో పనిచేసిన మున్సిపల్ కమిషనర్ హయాంలోనే విలువైనవి మాయమైనట్లు పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ విషయమై కమిషనర్‌కు 'సాక్షి' పలుమార్లు ఫోన్ చేయగా స్పందించలేదు.

ఒకరి ఆత్మహత్య

చెన్నారావుపేట: మానసికస్థితి బాగాలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన తిమ్మరాయినిపహాడ్ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి దాసరి బాలస్వామి (49) ఆరు నెలలుగా మానసికస్థితి సరిగాలేక ఇబ్బందులు పడుతున్నాడు. దీంతో ఆయనను హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ ఆస్పత్రి తీసుకెళ్లి కుటుంబ సభ్యులు చికిత్స చేయించారు. కాగా, గురువారం సాయంత్రం కుటుంబ సభ్యులు ఇంటిలో లేని సమయంలో బాలస్వామి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య రత్నమేరి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

నోటిఫికేషన్ 12 పోస్టులకు.. రిక్రూట్‌మెంట్ 32 పోస్టులకు!

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల భర్తీలో గోల్‌మాల్

- నర్సంపేట మెడికల్ కాలేజీ అధికారులు, ఏజెన్సీపై విమర్శలు
- న్యాయం చేయకుంటే ఆందోళన చేస్తామని అభ్యర్థుల హెచ్చరిక

నర్సంపేట రూరల్: నర్సంపేట మెడికల్ కాలేజీలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల భర్తీలో గోల్‌మాల్ జరిగిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 12 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి.. 32 పోస్టులకు రిక్రూట్‌మెంట్ చేయడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ నిర్వాహకులు, కళాశాల అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి. 12 ఔట్‌సోర్సింగ్ పోస్టుల భర్తీ కోసం గత నెల 19న కలెక్టర్ ప్రావీణ్య, ప్రిన్సిపాల్ కిషన్ ఆధ్వర్యంలో నోటిఫికేషన్ విడుదల చేశారు. నాలుగు డీ సెక్షన్‌హాల్ అటెండర్ పోస్టులు, నాలుగు ల్యాబ్ అటెండర్ పోస్టులు, నాలుగు థియేటర్ అనస్థీషియా అసిస్టెంట్ పోస్టుల కోసం అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. కానీ, గురువారం 32 పోస్టుల కోసం నియామకాలు చేపట్టడడంతో అభ్యర్థులు ఒక్కసారి కంగుతున్నారు. అసలు నోటిఫికేషన్ ఇచ్చింది 12 పోస్టులకు అయితే మరో 20 పోస్టులు ఎలా వచ్చాయని వారు ప్రశ్నించారు. ఎలాంటి నోటిఫికేషన్ లేకుండానే 10 డాటాఎంట్రీ ఆపరేటర్, 8 ఆఫీస్ సబార్డినేట్, 2 ఆఫీస్ అటెండెంట్ పోస్టులను ఎలా భర్తీ చేస్తారని నిలదీశారు. కాంట్రాక్టు పోస్టులైనా, ఔట్‌సోర్సింగ్ పోస్టులైనా సరే నోటిఫికేషన్ ఇవ్వకుండా భర్తీ చేసే అవకాశమే లేదని, కావాలని డబ్బులకు కక్కుర్తిపడి ఏజెన్సీ పేరు చెప్పుకుని అధికారులు దగా చేస్తున్నారని పలువురు బాహాటంగానే విమర్శించారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయకుంటే ఆందోళనలు చేపడుతామని వారు హెచ్చరించారు.



ఏప్రిల్ నెలలో 12 పోస్టులకు జారీచేసిన నోటిఫికేషన్

ఏజెన్సీ ఆధ్వర్యంలోనే మరో 20 పోస్టుల భర్తీ

> నర్సంపేట పట్టణంలో మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో 12 ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలకు గత నెల 19న నోటిఫికేషన్ ఇచ్చాం. నవోదయ ఏజెన్సీ ద్వారా మరో 20 పోస్టుల కోసం జాబితా వచ్చింది. ఏజెన్సీ ఇచ్చిన జాబితా ఆధారంగా రిక్రూట్‌మెంట్ చేస్తున్నాం. తుది నిర్ణయం ఏజెన్సీదే, మా చేతిలో ఏమి లేదు.
>
> – కిషన్, నర్సంపేట మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్

పచ్చిరొట్టతో భూమి సారవంతం

- జిల్లా వ్యవసాయ అధికారి ఉషాదయాళ్

ఖిలా వరంగల్: పచ్చిరొట్ట ఎరువుతోనే భూమి మరింత సారవంతమవుతుందని జిల్లా వ్యవసాయ అధికారి డి.ఉషాదయాళ్ అన్నారు. జిల్లాలోని పీఏసీఎస్ గోదాముల్లో 60 శాతం సబ్సిడీపై జీలుగ విత్తనాలు అమ్మకానికి సిద్ధంగా ఉంచామని తెలిపారు. వరంగల్ ఫోర్ట్‌రోడ్డులోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనంలో జీలుగ, ఎరువుల నిల్వలు, రికార్డులను గురువారం ఆమె పరిశీలించారు. అనంతరం ఉషాదయాళ్ మాట్లాడారు. రైతులు పంటపొలాల్లో రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని, పచ్చిరొట్ట ఎరువు జీలుగను పంట పొలాల్లో వేసుకుంటే దిగుబడి పెరుగుతుందని సూచించారు. అన్ని మండల కేంద్రాల్లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయాల్లో జీలుగ విత్తనాలు ఉన్నాయని తెలిపారు. జిల్లాకు 4వేల క్వింటాళ్లు కేటాయించగా ఇప్పటికే 2,500 క్వింటాళ్లు వచ్చినట్లు పేర్కొన్నారు. 30 కిలోల బస్తాకు రాయితీ మినహాయిస్తే రూ.1,116 రైతు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పత్తిలో హైబ్రిడ్ బీజీ-2 రకం విత్తనాలు కూడా మంచి దిగుబడి ఇస్తాయని చెప్పారు. మేలైన యాజమాన్యం పద్ధతులతో 90 శాతం దిగుబడి, విత్తన ఎంపికతో 10 శాతం మాత్రమే దిగుబడి వస్తుందని వివరించారు. రైతులు నేల స్వభావాన్ని బట్టి విత్తనాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. జిల్లాలో 6 లక్షల ప్యాకెట్లకు పైగా పత్తి విత్తనాలు అవసరం ఉంటాయని, ఇప్పటికే 3.60 లక్షల ప్యాకెట్లు మార్కెట్‌లోకి వచ్చాయని తెలిపారు. రైతులు విత్తన ప్యాకెట్ బిల్లును పంట కాలం పూర్తయ్యే వరకూ భద్రపరుచుకోవాలని చెప్పారు. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన అధీకృత డీలర్ వద్ద మాత్రమే సీల్డ్ ప్యాకెట్ గల విత్తనాలు కొనుగోలు చేయాలని, రాత్రి వేళ అమ్మిన వారి నుంచి విత్తనాలు కొనుగోలు చేయవద్దని కోరారు. ఎవరైనా అలా అమ్మితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. సమావేశంలో సొసైటీ అధ్యక్షుడు కేడల జనార్దన్, పి.సారంగం, సీహెచ్.కృష్ణారెడ్డి, ఏఓ విజ్ఞాన్, ఏఈఓ చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.



జీలుగ విత్తనాల నిల్వలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి డి.ఉషాదయాళ్

రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవానికి ఏర్పాట్లు

- జెండా ఆవిష్కరణ ప్రాంతం పరిశీలన



బల్దియా ప్రధాన కార్యాలయ ఆవరణను పరిశీలిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ అర్బన్: జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేయాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే.. అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బల్దియా ప్రధాన కార్యాలయ ఆవరణలో చేయాల్సిన ఏర్పాట్లపై గురువారం కమిషనర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద గల పోర్టికో వద్ద జెండా ఆవిష్కరించే ప్రాంతంతోపాటు గాంధీ విగ్రహం ప్రాంతంలో క్షేత్రస్థాయిలో పరిశీలించి మాట్లాడారు. వేడుకలను అట్టహాసంగా నిర్వహించాలని పేర్కొన్నారు. ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని, కుర్చీల ఏర్పాటుతోపాటు నీడ ఉండేలా టెంట్ ఏర్పాటు చేయాలన్నారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కార్పొరేటర్లందరూ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొనేలా ప్రత్యేకంగా ఆహ్వానించాలన్నారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ అనిసుర్ రషీద్, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, హెచ్ఓ రమేశ్, ఈఈ సంజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'కుడా'లో 'కోడ్' కొండెక్కింది!

నిబంధనలకు విరుద్ధంగా రూ.11 కోట్ల పనులకు టెండర్

- ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన 'కుడా' అధికారులు
- మాడవీధుల నిర్మాణ పనుల్లో హడావుడిపై అనుమానాలు

సాక్షిప్రతినిధి, వరంగల్: కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) ఇంజనీరింగ్ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా టెండర్లు పిలిచి ఎలక్షన్ కోడ్‌కు మంగళం పాడారు. తామనుకున్న వారికి దక్కాలనో.. కొందరికే ఆ పనులు కట్టబెట్టాలని తలచారో.. తెలియదు కానీ.. భద్రకాళి ఆలయ మాడ వీధుల నిర్మాణ పనుల విషయంలో చేసిన హడావుడి తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. పార్లమెంట్ ఓట్ల లెక్కింపు జూన్ 4న, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు జూన్ 5న ఉన్న విషయం అందరికీ తెలిసిందే. అప్పటి వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉండనుండగా.. అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, టెండర్లు పిలవరాదన్న నిబంధనలు ఉన్నాయి. ఇవేమీ పట్టని 'కుడా' అధికారులు సుమారు రూ.11 కోట్లకు పైగా వ్యయం కాగల భద్రకాళి ఆలయ మాడ వీధుల నిర్మాణ పనులకు టెండర్లు పిలిచారు. టెండర్ ఐడీ నంబర్ 515325 ద్వారా వేద పాఠశాల ఆర్‌సీసీ బిల్డింగ్ కూల్చివేతతోపాటు మాడవీధుల నిర్మాణం కోసం పనులను నిర్ణయించి డీ/779/2024 ద్వారా 23.05.2024 నోటిఫికేషన్ ఇచ్చారు. ఈ నెల 24న సాయంత్రం 5.30 గంటల నుంచి 28వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు టెండర్ బిడ్‌లను ఆన్‌లైన్ ద్వారా దాఖలు చేయవచ్చని సూచించారు. కాగా, ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో భద్రకాళి ఆలయ మాడవీధుల నిర్మాణం కోసం వేద పాఠశాలను కూల్చడానికి, ఫోర్ట్ వరంగల్‌లో నిర్మాణ పనుల కొరకు టెండర్లు పిలవడం వివాదాస్పదంగా మారింది. ఈ విషయమై కుడా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సిద్దూరి భీంరావు మాట్లాడుతూ అత్యవసర ప్రజా ఉపయోగకర పనుల నిర్మాణం కోసం టెండర్లు పిలవొచ్చని, త్వరగా పనులు చేపట్టకుంటే సీఎస్ఆర్ నిధులు వృథా అవుతాయనే అలా చేశామని తెలిపారు. పాత నిర్మాణాలు కూల్చడానికి బిడ్డర్‌లే టెండర్‌లో ధరను కోట్ చేస్తారని, మాడవీధుల నిర్మాణానికి రూ.11 కోట్లు కేటాయించారన్నారు.

పాముకాటుతో వివాహిత మృతి

నర్సంపేట రూరల్: పాముకాటుతో చికిత్స పొందుతున్న వివాహిత మృతిచెందిన సంఘటన నర్సంపేట మండలంలోని లక్నెపల్లి గ్రామంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. లక్నెపల్లి గ్రామానికి చెందిన వడిపల్లి భవాని(30)కి మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం దామెరవంచకు చెందిన రణధీర్‌తో వివాహం జరిగింది. వీరికి మూడు సంవత్సరాల కుమారుడు ఉన్నాడు. బుధవారం సాయంత్రం లక్నెపల్లి గ్రామంలోని పుట్టింటికి కొడుకుతో వచ్చింది. అయితే, రాత్రి భోజనం అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ఆరుబయట నిద్రకు ఉపక్రమించింది. రాత్రి పాము వచ్చి భవానిని కాటు వేయడంతో వెంటనే వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. భవాని మృతితో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

బీఆర్‌ఎస్ నేతలపై కేసు నమోదు

ఖిలా వరంగల్: ఎన్నికల కోడ్ నిబంధనలను ధిక్కరించి శిల్పాల ప్రాంగణంలోకి ప్రవేశించిన ఏడుగురు బీఆర్‌ఎస్ నేతలపై కేసు నమోదు చేసినట్లు మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. అయన కథనం ప్రకారం.. రాజముద్ర నుంచి కాకతీయ కళాతోరణం తొలగింపును నిరసిస్తూ బుధవారం సాయంత్రం మధ్యకోట శిల్పాల ప్రాంగణంలోకి మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, దాస్యం వినయ్‌భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డితోపాటు బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి ప్రవేశించి కాకతీయుల కళా తోరణం ఎదుట ధర్నా నిర్వహించారు. కోడ్ ఉల్లంఘించారని కేంద్ర పురావస్తుశాఖ హోంగార్డు వేముల లక్ష్మణ్‌రెడ్డి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

పీజీ కోర్సుల సెకండియర్ రెండో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో పీజీ కోర్సుల (నాన్ ప్రొఫెషనల్స్) కోర్సుల సెకండియర్ రెండో సెమిస్టర్ పరీక్షలు జూన్ 11వతేదీ నుంచి నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ఎస్.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్యజీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ కోర్సులతోపాటు కంప్యూటర్ సైన్స్, ఎంటీఏ, ఎంఎస్‌డబ్ల్యూ, అండ్ ఎంహెచ్ఆర్ఎం, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ కోర్సుల రెండో సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్ విడుదల చేశారు. జూన్ 11, 13, 15, 18, 20, 22 తేదీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారని వారు తెలిపారు.

క్లుప్తంగా

దుస్తులు ఆరేస్తూ మృత్యుఒడికి..

- విద్యుదాఘాతంతో యువకుడి మృతి
- తొర్రూరులో ఘటన


వినీత్‌కుమార్ మృతదేహం

తొర్రూరు: దుస్తులు ఆరేస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన డివిజన్ కేంద్రం తొర్రూరులో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌కు చెందిన వినీత్ కుమార్(36) కొంత కాలంగా తొర్రూరు కేంద్రంగా ఐస్ క్రీమ్ తయారీ, చెరుకు రసం వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో అద్దెకుంటున్న ఇంటి ఎదుట దుస్తులు ఆరేసేందుకు తీగలు ఏర్పాటు చేసుకున్నాడు. గురువారం రాత్రి స్నానం చేసి దుస్తులు ఆరేస్తున్న క్రమంలో తీగకు విద్యుత్ ప్రసరించింది. దీంతో షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య రిషిత, కుమార్తె, కుమారుడు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించి నమోదు చేసుకున్నారు.

ఇస్తారి పరిశోధనకు పేటెంట్

- అభినందించిన రిజిస్ట్రార్ మల్లారెడ్డి


ఇస్తారిని అభినందిస్తున్న కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి, పక్కన కోలశంకర్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ జువాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మామిడాల ఇస్తారి, రీసెర్చ్ స్కాలర్ రాకేశ్ కలిసి చేసిన పరిశోధనకు పేటెంట్ లభించింది. 'అంత్రాక్వినోస్ ఆఫ్ రుమెక్స్ వేసి కారియాస్ యూజ్ ఏడై పెప్టిడైల్ పెప్టీడేజ్ ఇన్హిబిటార్' అనే అంశంపై చేసిన పరిశోధనకుగాను భారత ప్రభుత్వం పేటెంట్ కార్యాలయం డాక్టర్ ఇస్తారికి పేటెంట్ సర్టిఫికెట్ జారీచేసింది. ఈ మేరకు కేయూ రిజిస్ట్రార్ పి మల్లారెడ్డి గురువారం యూనివర్సిటీలో ఇస్తారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ కోల శంకర్ కూడా ఉన్నారు. ఈ సందర్భంగా మామిడాల ఇస్తారి తన పరిశోధన అంశం గురించి వివరించారు. డీసీపీ -4 అనే ఎంజైమ్ ఇన్సులిన్ విడుదలకు తోడ్పడే జీఎల్‌పీ -1 హార్మోన్‌ను నిరోధిస్తుందన్నారు. ఈ డీసీపీ -4 ఎంజైమ్ క్రియాశీలతను తగ్గిస్తే ఇన్సులిన్ విడుదలకు ఎలాంటి ఆటంకం లేకుండా జరుగుతుందని తెలిపారు. అందుకే రుమేక్స్ వేసికేరియస్ అనే మొక్క నుంచి అంత్రాక్వినోస్ రకానికి చెందిన రసాయనిక మూలకం ద్వారా ఈడీసీపీ -4 క్రియాశీలతను తగ్గించేందుకుగాను అనువైన పద్ధతిని ప్రవేశపెట్టినందునకుగాను భారత ప్రభుత్వం తమ పరిశోధనకుగాను పేటెంట్ జారీ చేసిందని తెలిపారు.

హాజరుపై నజర్

ఉద్యోగ సంఘాల నేతలు విధులకు డుమ్మా కొడుతున్నారని ఫిర్యాదులు

- గతంలో ఫుల్‌టైమ్ అనుమతిచ్చిన యాజమాన్యం
- 2023 జనవరి నుంచి ఎత్తివేత
- రాష్ట్ర నాయకులకు సంకట స్థితి
- నేతల హాజరు వివరాలు కోరిన విజిలెన్స్

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్‌లో ఉద్యోగ సంఘాల నాయకుల హాజరుపై యాజమాన్యం దృష్టి సారించింది. ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగుల సంక్షేమ అసోసియేషన్ల నాయకులు విధులకు డుమ్మా కొడుతున్నారని టీజీ ట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్, టీజీ ఎన్పీడీసీఎల్‌కు ఫిర్యాదులందాయి. దీంతో విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. ఈమేరకు ఉద్యోగ సంఘాల నాయకులు పని చేస్తున్న కార్యాలయాల ఉన్నతాధికారులకు వివరాలు పంపాల్సిందిగా లేఖలు రాశారు.

గతేడాది నుంచి ఒకరికే!

రాష్ట్రంలో టీజీ జెన్‌కో, టీజీ ట్రాన్స్‌కో, టీజీ దక్షిణ విద్యుత్ పంపిణీ మండలి, టీజీ ఉత్తర విద్యుత్ పంపిణీ మండలి ఉన్నాయి. గతంలో ఈ నాలుగు విద్యుత్ సంస్థల నుంచి యూనియన్‌కు ఒకరు చొప్పున నలుగురు ఉద్యోగ సంఘాల నాయకులు ఫుల్ టైమ్ అనుమతి తీసుకునేవారు. 2023 క్యాలెండర్ ఇయర్‌లో ఒక యూనియన్ నుంచి నలుగురికి అవకాశం కల్పించకుండా, ఒకే ఒక్క యూనియన్ నుంచి రాష్ట్రంలో ఒక్కరికి మాత్రమే ఫుల్‌టైమ్ ఇవ్వాలని 2022 డిసెంబర్16న జరిగిన తెలంగాణ స్టేట్ పవర్ కంపెనీస్ కో ఆర్డినేషన్ మీటింగ్‌లో నాలుగు విద్యుత్ యాజమాన్య సంస్థలు నిర్ణయం తీసుకున్నాయి. అనంతరం 2023 క్యాలెండర్ సంవత్సరంలో కేవలం ఒక్క యూనియన్‌లో ఒక్కరికి మాత్రమే ఫుల్‌టైం అనుమతికి అవకాశమిచ్చింది. ఇది యూనియన్లు, వెల్ఫేర్ అసోషియేషన్‌లో అప్పట్లో పెద్ద దుమారం లేపింది. ఫుల్‌టైమ్ అంటే యూనియన్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్న వ్యక్తి ఆ యూనియన్ సభ్యుల సమస్యల పరిష్కారం కోసం, సమావేశాలకు హాజరవడం, ఇతరత్రా యూనియన్ కార్యకలాపాల్లో పాల్గొనేందుకు విధులకు హాజరు కాకుండా పూర్తి స్థాయిలో మినహాయింపు ఇస్తారు. ఇటు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ.. యూనియన్ కార్యకలాపాల్లో పాల్గొనేందుకు వీలు కాదని భావించి సంస్థ ఫుల్‌టైమ్ అనుమతిస్తుంది.

వర్క్‌మెన్ కేడర్‌కు ఇవ్వాలని..

వర్క్‌మెన్ కేడర్‌కే ఫుల్ టైమ్ ఇవ్వాలని విద్యుత్ సంస్థల యాజమాన్యాలు నిర్ణయించాయి. వర్క్‌మెన్ కేడర్ అంటే.. అధికారుల కంటే కింది స్థాయి ఉద్యోగులు, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్‌లో జేఎల్‌ఎం నుంచి ఫోర్‌మెన్ వరకు, ప్రొవెన్షియల్ (మినిస్టీరియల్) స్టాఫ్‌లో అటెండర్ స్థాయి నుంచి సీనియర్ అసిస్టెంట్ స్థాయి వరకు వస్తారు. ఆతర్వాత స్థాయి



వారు వర్క్‌మెన్ కేడర్ పరిధిలోకి రారు. అయితే పలు యూనియన్లకు వర్క్‌మెన్ కేడర్ పై స్థాయి ఉద్యోగంలో కొనసాగుతున్న జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌లు రాష్ట్ర స్థాయి కీలక పదవుల్లో కొనసాగుతున్నారు. 2023 నుంచి వీరికి ఫుల్‌టైం అనుమతి నిలిచిపోయింది. దీంతో రాష్ట్ర స్థాయి పదవుల్లో ఉన్న యూనియన్, అసోషియేషన్ల నాయకులు యూనియన్ కార్యక్రమాల్లో పాల్గొనాల్సి రావడం, ఉద్యోగుల సమస్యలు యాజమాన్యాల దృష్టికి తీసుకెళ్లే క్రమంలో విధులకు హాజరు కాలేకపోతున్నారు. దీన్ని అదనుగా తీసుకున్న కొందరు యూనియన్ నాయకులు విధులకు హాజరు కావడంలేదని పేర్లతో సహా టీజీ ట్రాన్స్‌కో, టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యాలకు ఫిర్యాదు చేశారు. నిజామాబాద్‌కు చెందిన బీఎంఎస్ నాయకుడు రాజేశ్వర్ రెడ్డి, విద్యుత్ సంస్థల సంక్షేమ సంఘం పేరుతో ఫిర్యాదులు యాజమాన్యాలకు అందాయి. దీంతో విద్యుత్ సంస్థల యాజమాన్యాలు యూనియన్ నాయకులు విధులకు హాజరు అవుతున్నారా? లేదా తెలుసుకునే పనిలో పడింది. సంబంధిత యూనియన్ నాయకుల హాజరు వివరాలు పంపాలని వారు పని చేస్తున్న కార్యాలయాల ప్రధాన అధికారికి విజిలెన్స్ విభాగం లేఖలు రాసింది. దీంతో ఫుల్‌టైం అనుమతి మరోసారి చర్చకు దారితీసింది. హాజరు వివరాలు సేకరించిన అనంతరం యాజమాన్యం ఏ నిర్ణయం తీసుకుంటుందో.. అని ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

సైలానీబాబా ఉర్సుకు వేళాయె..


ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీఐ రంజిత్‌కుమార్


సైలానీబాబా దర్గా

- రేపటి నుంచి జాతర ప్రారంభం
- వివరాలు వెల్లడించిన దర్గా పీఠాధిపతి అబ్దుల్ హమీద్

దామెర: హనుమకొండ జిల్లా దామెర మండలం ఓగ్లాపూర్ సమీపంలోని సైలానీ బాబా దర్గాలో 117వ హజ్రత్ సైలానీ బాబా గంధం (ఉర్సు) ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు దర్గా పీఠాధిపతి మహమ్మద్ అబ్దుల్ హమీద్ గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు ప్రకటించారు. జూన్1న (శనివారం) రాత్రి గంధం జాతర ప్రారంభం అవుతుందన్నారు. ఇందులో భాగంగా మహారాష్ట్ర నుంచి ప్రత్యేకంగా తీసుకొచ్చిన బ్యాండ్ కళాకారుల నృత్యాలు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫకీర్ల విన్యాసాలు కనువిందు చేస్తాయన్నారు. తెల్లవార్లు జరిగే ఈ ఉత్సవంలో ప్రత్యేకంగా అలంకరించిన ఒంటెలపై తీసుకొచ్చిన గంధం దర్గాలో సమర్పిస్తామన్నారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పీఠాధిపతులు ప్రార్థనలు చేస్తారన్నారు. ఉత్సవాల్లో భాగంగా రెండో 2న (ఆదివారం) రాత్రి ఖవ్వాలీ బృంద కళాకారులతో ప్రదర్శనలు, 3వ రోజు జూన్3న (సోమవారం) తహెల్ ఫాతేహా కార్యక్రమం నిర్వహించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేస్తామని వెల్లడించారు.

దేశం నలుమూలల నుంచి భక్తుల రాక..

మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు ఉమ్మడి రాష్ట్రంతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్, రాజస్తాన్ నుంచి కూడా భక్తులు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. సుమారు రెండు లక్షల మంది హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. కాగా, దర్గా ప్రాంగణాన్ని పరకాల రూరల్ సీఐ రంజిత్ రావు, ఎస్సై కొంక అశోక్ పరిశీలించారు. వీరివెంట రషీద్ బాబా, అమీర్ బాబా, ఎస్‌కే మోయిన్ సైలానీబాబా ఖాదీమ్ తదితరులు ఉన్నారు.

పోలీసులకు చిక్కిన ఘరానా మోసగాడు

- బ్యాంకు బంగారం కాజేసిన గోల్డ్ అప్రైజర్ అరెస్ట్
- వివరాలు వెల్లడించిన ఏటూరునాగారం ఏఎస్పీ మహేష్ గీతె బాబాసాహెబ్

ఏటూరునాగారం: బ్యాంకులో కుదవపెట్టిన బంగారం కాజేసిన గోల్డ్ అప్రైజర్ సమ్మెట ప్రశాంత్‌ను అరెస్ట్ చేసినట్లు ఏటూరునాగారం ఏఎస్పీ మహేష్ గీతె బాబాసాహెబ్ తెలిపారు. ఈ మేరకు గురువారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఘటనకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ములుగు జిల్లా మంగపేట మండలం రాజుపేటలోని కెనరా బ్యాంక్‌లో ప్రశాంత్ గోల్డ్ అప్రైజర్‌గా పనిచేస్తూనే సొంతంగా బ్యాంకు పక్కనే సాయిరామ్ జువెల్లర్స్ షాపు నిర్వహిస్తున్నాడు. మూడు నెలల నుంచి వినియోగదారులు బాంకులో లోన్ కోసం కుదువపెట్టిన బంగారం కాజేసి సొంత అవసరాలకు వాడుకున్నాడు. తన షాపునకు వచ్చే కస్టమర్లు నగల కోసం అడ్వాన్స్‌గా ఇచ్చే డబ్బును స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడికి ఉపయోగిస్తూ మొదట రూ. ఐదు లక్షలు నష్టపోయాడు. తరువాత మరో రూ. ఐదు లక్షలు..ఇలా సుమారు రూ. 70లక్షల వరకు నష్టపోయాడు. ఈ క్రమంలో వినియోగదారులు తాము ఇచ్చిన డబ్బుకు బంగారం ఇవ్వాలని, లేదా డబ్బు ఇవ్వాలని ఒత్తిడి తెచ్చారు. దీంతో ఎలాగైనా కస్టమర్లకు డబ్బు ఇవ్వాలనే ఉద్దేశంతో తాను అప్రైజర్‌గా పనిచేస్తున్న కెనరా బ్యాంకును టార్గెట్ చేసుకున్నాడు. ఇందులో భాగంగా వినియోగదారులు


ప్రశాంత్ అరెస్ట్ చూపుతున్న పోలీసులు

బ్యాంకులో కుదవపెట్టి డబ్బు తీసుకునేందుకు ఇచ్చిన బంగారాన్ని క్రమక్రమంగా కాజేయడం మొదలు పెట్టాడు. లోన్ కోసం వస్తున్న వారి బంగారం పరిక్షిస్తున్నట్లు నమ్మించి ఎవరూ చూడని సమయంలో ఆ బంగారం కాజేసి దాని స్థానంలో నకిలీ గోల్డ్ ప్యాకెట్ ఉంచేవాడు. ఇలా మూడు నెలల నుంచి బ్యాంకులో 24 మంది కస్టమర్లకు చెందిన బంగారాన్ని ఇదే తరహాలో కాజేశాడు. ఈ ఘటనపై బ్యాంకు అధికారుల ఫిర్యాదు మేరకు కేసు పోలీసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో ఏటూరునాగారంలోని ఎక్కెల క్రాస్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో ప్రశాంత్ పట్టుబడ్డాడు. దీంతో అతడి నుంచి రూ.2,82,000 లక్షల విలువైన 47 గ్రాములు బంగారం, రూ. 2లక్షల 19వేల విలువైన 2.190 కిలోల వెండి, రూ. 2.51లక్షల నగదు, ఓ కారు, 8 మొబైల్స్ స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ తెలిపారు. అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ కేసును చేదించి ఏటూరునాగారం సీఐ రాజు, మంగపేట ఎస్సై రవి, ములుగు సీసీ సిబ్బందిని ఏఎస్పీ అభినందించారు.

కుళ్లిన మాంసం ముద్దలు.. | బూజుపట్టిన చేప ముక్కలు

- హానికర రంగులతో తినుబండారాలు
- ఆహార పదార్థాల్లో పురుగులు.. కాలం చెల్లిన సరుకులు..
- హనుమకొండలోని మూడు హోటళ్లలో అధికారుల తనిఖీలు
- కళ్లు బైర్లు కమ్మే నిజాలు వెలుగులోకి..

వరంగల్ అర్బన్/ హన్మకొండ: నిషేధిత ప్లాస్టిక్ కవర్లలో కుళ్లిన మాంసం ముద్దలు.. బూజుపట్టి పట్టిన చేప ముక్కలు.. బొద్దింకలతో కూడిన ఇడ్లీ పిండి, బెల్లం.. హానికర రంగులతో పన్నీరు.. తుప్పు పట్టిన వంట పాత్రలు.. అపరిశుభ్రత వాతావరణం.. కాలం చెల్లిన సరుకులు.. ఇలా గురువారం హనుమకొండలోని మూడు పేరుగాంచిన హోటళ్లలో అధికారులు తనిఖీలు చేపట్టగా కళ్లు బైర్లు కమ్మే నిజాలు వెలుగు చూశాయి. రాష్ట్ర వ్యాప్త తనిఖీల్లో భాగంగా హనుమకొండలో రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జోనల్ ఫుడ్ కంట్రోలర్ టి. జ్యోతిర్మయి ఆధ్వర్యంలో అధికారులు పలు హోటళ్లలో సోదాలు నిర్వహించారు. హనుమకొండలోని అరణ్య, జంగల్ థీమ్ రెస్టారెంట్‌లో ప్రమాదకర ప్లాస్టిక్ కవర్లలో భారీగా మాంసపు ఉత్పత్తుల నిల్వ బయటపడ్డాయి. హానికర రంగులు కలిపిన పన్నీరు, తుప్పు పట్టిన వంట పాత్రలు, ఫంగస్‌తో


హనుమకొండలోని ఓ హోటల్‌లో ఆహార పదార్థాలు తనిఖీ చేస్తున్న ఫుడ్‌సేఫ్టీ అధికారులు

కూడిన బూజు పట్టిన కూరగాయలు గుర్తించారు. దీంతో హోటల్ యాజమాన్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే 26 కేజీల మాంసం ఉత్పత్తులు స్వాధీనం చేసుకుని నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. అలాగే, హనుమకొండ ఆర్‌టీసీ బస్టాండ్ సమీపంలోని శ్రేయ హోటల్‌లో తనిఖీలు నిర్వహించారు. ఇందులో కృత్రిమ హానికర రంగులు కలిపి చేసిన చికెన్ కబాబ్స్, మాంసపు ఉత్పత్తులు, తదితర ఆహార పదార్థాలను అపరిశుభ్ర వాతావరణంలో తయారు చేసి వినియోగదారులను అనారోగ్యాల పాలు చేస్తున్నట్లు గుర్తించారు. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్న సదరు హోటల్ యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు. సుమారు 11 కేజీల రంగు కలిపిన, బూజు పట్టిన చికెన్, ప్రిపేర్ ఫిష్ టిక్కా, బొద్దింకలతో కూడిన ఇడ్లీ పిండి, బెల్లం ధ్వంసం చేసి నోటీసులు అందచేశారు.

హోటల్ అశోకాకు ఇంప్రూవ్మెంట్, ఎఫ్ఎస్ఎస్ఏఐ నోటీసులు..

హనుమకొండ చౌరస్తాలోని అశోకా హోటల్ (కాకతీయ హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్)ను తనిఖీ చేయగా హానికర కృత్రిమ రంగులు కలిపిన ఆహార పదార్థాలు లభించాయి. అలాగే, భారీగా రంగు డబ్బాలు, రీ-యూజుడ్ 10 లీటర్ల మంచి నూనె, కాలం చెల్లిన కసూరి మేతి, ఎవరెస్టు చికెన్ మసాలా, కాల పరిమితి ముగిసిన సాస్ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. అలాగే, బ్యాచ్ నంబర్, మ్యానుఫ్యాక్చరింగ్ డేట్ లేకుండా స్టోర్ రూమ్‌లో నిల్వ ఉంచిన రూ. 5,500 విలువైన 17 నూడుల్స్ ప్యాకెట్లు, 28 సోంపు ప్యాకెట్లు సీజ్ చేశారు. శాంపిల్స్ తీసి ప్రయోగశాలకు తరలించారు. హోటల్ యాజమాన్యానికి ఇంప్రూవ్మెంట్ నోటీస్, ఎఫ్ఎస్ఎస్ఏఐ నోటీసు జారీ చేశారు. అనంతరం బల్దియాకు చెందిన వాహనం ద్వారా కుళ్లిన మాంసం వ్యర్థాలను తరలించి పూడ్చిపెట్టారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో హనుమకొండ ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ పి వేణుగోపాల్ , వరంగల్ ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ సీహెచ్. కృష్ణమూర్తి, మహబూబ్‌నగర్ జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ పి. మనోజ్ కుమార్, నల్లగొండ జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ పి. స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు

- మహిళ మృతి.. యువకుడికి గాయాలు


ప్రమాదంలో గాయపడిన రవికిరణ్

ఖానాపురం : కారు.. ఓ ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో మహిళ మృతి చెందగా యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం ఖానాపురం మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల ప్రకారం.. ములుగు జిల్లా రాయినిగూడేనికి చెందిన గొంది నర్సమ్మ(51) మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం సాధిరెడ్డిపల్లిలో శుభకార్యానికి హాజరైంది. నర్సంపేటలో పనుల నిమిత్తం అదే గ్రామానికి చెందిన తన బంధువు ఫులుసం రవికిరణ్ ద్విచక్ర వాహనంపై వచ్చింది. పనులు ముగించుకుని సాధిరెడ్డిపల్లికి తిరుగుపయనమయ్యారు. ఈ క్రమంలో హైదరాబాద్‌కు చెందిన ఐదుగురు యువకులు కారులో భద్రాచలం వెళ్లి హనుమకొండకు వస్తున్నారు. మండలంలోని చిలుకమ్మనగర్ చెక్ పోస్టు సమీపంలో కారు.. ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నర్సమ్మ, రవికిరణ్‌కు తీవ్ర గాయాలు కావడంతో గమనించిన ఇతర వాహనదారులు నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతర మెరుగైన వైద్యం కోసం ఇద్దరిని వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ నర్సమ్మ మృతి చెందింది. రవికిరణ్ చికిత్స పొందుతున్నారు. ఘటనా స్థలిని ఎస్సై రఘుపతి సందర్శించి వివరాలు సేకరించారు. మృతురాలికి కుమార్తె ఉంది. ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

భూమి దక్కదనే మనస్తాపంతో రైతు ఆత్మహత్య


సారయ్య(ఫైల్)

సంగెం: భూమి విషయంలో తిట్టి అవమానించారని, భూమి దక్కదని మనస్తాపం చెందిన ఓ వృద్ధ రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నించి చికిత్స మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా సంగెం మండలం ముమ్మడివరం గ్రామానికి చెందిన దామెర్ల సారయ్య(70కు ఇద్దరు కుమారులు రాజేశ్వర్, విజయ్‌కుమార్ ఉన్నారు. తనకున్న వ్యవసాయ భూమిని ఇద్దరు కుమారులకు సమానంగా పంచి ఇచ్చాడు. ఇటీవల చిన్న కుమారుడు విజయ్‌కుమార్ తన భూమిని హనుమకొండకు చెందిన లాయర్ నిమ్మాని శేఖర్‌రావు, విజయలక్ష్మి దంపతులకు విక్రయించేందుకు ఒప్పందం కుదుర్చుకుని బయానాగా రూ.1.50లక్షలు తీసుకుని, పట్టాదార్ పాస్‌బుక్ ఇచ్చారు. ఈ విషయం విజయ్‌కుమార్ భార్య రవళికి తెలిసి భూమి విక్రయించొద్దని గొడవ చేసింది. దీంతో విజయ్‌కుమార్ తన భార్య రవళి, తండ్రి సారయ్య(మృతుడు), పెద్ద మనుషులతో కలిసి లాయర్ శేఖర్‌రావు ఇంటికి వెళ్లి అడ్వాన్స్ తీసుకున్న డబ్బులు తిరిగి ఇస్తాం.. మా పట్టాదార్ పాస్‌బుక్ ఇవ్వాలని కోరారు. దీంతో లాయర్ దంపతులు అసభ్యపదజాలంతో దూషించి వెళ్లగొట్టారు. ఈ క్రమంలో వారం క్రితం విజయ్‌కుమార్, రవళి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా కుటుంబీకులు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. తన కుటుంబంలో గొడవలకు కారణం లాయర్ శేఖర్ రావు, విజయలక్ష్మి దంపతులేనని.. భూమి దక్కదని మనస్తాపానికి గురైన సారయ్య బుధవారం రాత్రి వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబీకులు వరంగల్ ఎంజీఎం తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై సారయ్య పెద్ద కుమారుడు రాజేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ వెల్లడించారు.

వరంగల్ పాతక్ మహల్‌లో వివాహిత..

రామన్నపేట : మనస్తాపంతో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన వరంగల్ పటాక్ మహల్‌లో జరిగింది. మట్టెవాడ సీఐ గోపి కథనం ప్రకారం.. నాక్ సేవిక్ సమితి అనుబంధంగా ఉన్న వైదేహి ఆశ్రమంలో ఉంటున్న భవ్య(23)కు వరంగల్ పాతక్‌మహల్‌కు చెందిన గంప రాజేశ్‌తో వివాహం జరిగింది. ఈ దంపతులకు మొదటి సంతానంగా కుమారుడు జన్మించి ప్రస్తుతం 18 నెలలు ఉన్నాడు. రెండో కాన్పులో మూడు నెలల తరువాత అబార్షన్ కావడంతో మనస్తాపానికి గురైన భవ్య.. 29వ తేదీన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై సేవి సమితి కార్యనిర్వహక కార్యదర్శి కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గోపి తెలిపారు.

పట్టపగలే చోరీ..

- పార్క్ చేసిన స్కూటీ డిక్కీ నుంచి రూ.2 లక్షల నగదు అపహరణ
- మహబూబాబాద్‌లో ఘటన

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్‌లో పట్టపగలే చోరీ జరిగింది. పార్క్ చేసిన స్కూటీ డిక్కీ నుంచి రూ.2 లక్షల నగదు అపహరణకు గురైంది. బాధితురాలి కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం బంచరాయితండాకు చెందిన నూనావత్ గల్కీ.. శ్రీహనుమాన్ స్వయం సహాయక సంఘం గ్రూపు లీడర్‌గా వ్యవహరిస్తోంది. గల్కీ గ్రూపునకు రూ.20 లక్షల రుణం మంజూరుకాగా ఆ డబ్బు డ్రా చేసుకునేందుకు పలువురు సంఘం సభ్యులతో కలిసి గురువారం జిల్లా కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (నెహ్రూ చౌక్) బ్రాంచ్ వద్దకు వచ్చింది. రూ.5 లక్షలు డ్రా చేసి అందులో నుంచి రూ.2 లక్షలు ఓ సభ్యురాలు నూనావత్ విజయకు, రూ.లక్ష గల్కీ కోడలు నూనావత్ మీనాకు ఇచ్చింది. మిగతా రూ.2 లక్షలు తన తమ్ముడు భూక్యా రాములు కుమారుడు రంజిత్‌కు


బాధితురాలు నూనావత్ గల్కీ

ఇవ్వగా అతడు బ్యాంకు సమీపంలో పార్క్ చేసిన తన స్కూటీ డిక్కీలో భద్రపరిచాడు. అనంతరం గ్రూపు సభ్యురాలు విజయకు ఉపాధి హామీ పథకంలో పనిచేసిన డబ్బులు తన ఖాతాలో జమ అయ్యాయో లేదో తెలుసుకునేందుకు పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఇందిరా చౌక్) బ్రాంచ్ వద్దకు వెళ్లారు. బ్యాంకు ఎదుట ద్విచక్ర వాహనం పార్క్ చేసి లోపలికి వెళ్లి సమాచారం తెలుసుకుని వచ్చారు. అనంతరం ద్విచక్రవాహనంపై తమ గ్రామానికి బయలుదేరారు. గ్రామ సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద స్కూటీలో పెట్రోల్ పోయించుకునేందుకుగాను డిక్కీ తెరువగా అందులోని రూ.2 లక్షలు కనిపించకపోవడంతో చోరీ జరిగిందని గుర్తించారు. వెంటనే వచ్చి బ్యాంకులో అధికారులకు జరిగిన విషయం చెప్పి బాధితురాలు గల్కీ కన్నీరుమున్నీరయ్యారు. అనంతరం మహబూబాబాద్ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఐ దేవేందర్ ఘటనా స్థలికి చేరుకుని సీసీ ఫుటేజీ పరిశీలించి విచారణ చేపట్టారు.

సైబర్ మోసం..

- రూ.1.04 లక్షలు మాయం
- యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పేరుతో లింక్..
- క్లిక్ చేయగానే నగదు స్వాహా
- గడ్డిగూడెంలో ఘటన

మహబూబాబాద్ రూరల్ : యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పేరుతో సమాచారం కోసం వచ్చిన ఓ లింకుపై క్లిక్ చేయండి అని కనిపించిన సందేశం అతడి కొంపముంచింది. నిజంగానే తన బ్యాంకు నుంచే ఆ లింక్ వచ్చిందనుకుని పొంచి ఉన్న మోసాన్ని గుర్తించలేక తన బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.1.04 లక్షల నగదును ఓ యువకుడు పోగొట్టుకున్నాడు. ఈ ఘటన గురువారం మహబూబాబాద్ మండలం గడ్డిగూడెంలో చోటుచేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం .. గ్రామానికి చెందిన ధరావత్ వెంకన్నకు మహబూబాబాద్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఖాతా ఉంది. తన సెల్ ఫోన్‌కు ఈ నెల 29వ తేదీన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పేరుతో బ్యాంకు లోగో కలిగిన గుర్తు నుంచి ఒక లింక్ వచ్చింది. సమాచారం కోసం లింక్‌ను క్లిక్ చేయండి అని కనిపించడంతో వెంటనే దానిపై క్లిక్ చేశాడు. 30వ తేదీన సెల్ ఫోన్ చూసుకుంటే తన బ్యాంకు ఖాతానుంచి రూ.24,500, రూ.25,500, రూ.54 వేలు చొప్పున విడుతల వారీగా రూ.1.04 లక్షలు ఉపసంహరణ అయినట్లు మెసేజ్ వచ్చింది. దీనిపై సంబంధిత


వివరాలు వెల్లడిస్తున్న బాధితుడు వెంకన్న

బ్యాంకుకు వెళ్లి ఆరాతీయగా అతడి ఖాతాలో నగదు ఉపసంహరణ అయినట్లు అధికారులు తెలిపి, వెంటనే ఆ ఖాతా లావాదేవీలను నిలుపుదల చేశారు. బ్యాంక్ అధికారుల సూచన మేరకు వెంకన్న సైబర్ క్రైమ్ విభాగం నంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు. భవిష్యత్ అవసరాల కోసం పొదుపు చేసిన సొమ్ము ఇలా దోపిడీకి గురవడంతో బాధితుడు కన్నీరుమున్నీరవుతున్నాడు. అపరిచిత వ్యక్తుల ద్వారా వచ్చే ఫోన్ కాల్స్‌కు బ్యాంక్ అకౌంట్ వివరాలు, ఇతర సమాచారం ఇవొద్దని పోలీసులు ఎంత చెప్పినా ప్రజలు మాత్రం పట్టించుకోవడం లేదు. సులువుగా డబ్బులు వస్తాయనే ఆశతో సైబర్ మోసగాళ్లకు బ్యాంకు సమాచారం ఇచ్చి ఖాతాను గుల్లచేసుకుంటున్నారు.

ఆవేశంలో అనంతలోకాలకు..

పరికత్వత లేని వయసు.. మంచి, చెడులు పట్టించుకోని స్వభావం.. పైగా క్షణికావేశం.. ఇంకేముంది అనాలోచిత నిర్ణయంతో తనువులు చాలిస్తున్నారు. తల్లిదండ్రులు మందలించారనే కారణంతో పిల్లలు మనస్తాపం చెంది అర్ధాంతరంగా జీవితాలు ముగిస్తున్నారు. కారణాలు విశ్లేషించుకోకుండా బలవన్మరణాలకు పాల్పడుతూ తల్లిదండ్రులకు కడుపుకోత మిగుల్చుతున్నారు.

తండ్రి మందలించాడని.. తనయుడి బలవన్మరణం


అవీజ్(ఫైల్)

గీసుకొండ : తండ్రి మందలించాడనే కారణంతో మనస్థాపం చెందిన ఓ యువకుడు బావిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. షేక్ అవీజ్ (18) అనే యువకుడు వరంగల్ ఆటోనగర్‌లో వెల్డింగ్ రిపేరింగ్ పనులు చేస్తున్నాడు. ఈ నెల 27న పని సరిగా చేయడం లేదని తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన అవీజ్.. పనికి వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. తెలిసిన వారు, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో గురువారం గొర్రెకుంటలోని కందుల రమేశ్ వ్యవసాయ బావిలో అవీజ్ మృతదేహం తేలింది. దీనిని పరిశీలించిన తండ్రి షేక్ ఇమాం.. ఆ మృతదేహం తన కుమారుడిదని గుర్తించారు. అనంతరం షేక్ ఇమాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు గీసుకొండ సీఐ ఎల్. పవన్‌కుమార్ తెలిపారు.

మైసంపల్లిలో బాలుడు..

దుగ్గొండి: ఎండలు తీవ్రంగా ఉన్నాయని, ఇంట్లోనే ఉండాలని తల్లి మందలించిందనే కారణంతో ఓ బాలుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన గురువారం వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం మైసంపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన మోకిడె శాంత భర్త రాజు కొంత కాలం క్రమృతి చెందడంతో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. ఇద్దరు కుమారులు ఉండగా పెద్ద కుమారుడు శివప్రసాద్‌ను టెన్త్ క్లాస్ కోచింగ్‌కు పంపింది. చిన్న కుమారుడు కాంతారావు(సిద్దు)(9) మూడో తరగతి పూర్తి చేశాడు. ఈ క్రమంలో వేసవి ఎండలు తీవ్రంగా ఉన్నాయని ఇష్టం వచ్చినట్లు తిరుగుతున్నావని, ఇంట్లోనే ఉండాలని మందలించింది. దీనిపై మనస్తాపం చెందిన సిద్దు.. తల్లి కూలీ పనులకు వెళ్లిన అనంతరం ఉరేసుకున్నాడు. ఇది గమనించిన ఇరుగుపొరుగు వారు కాపాడే ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి మేనమామ దోలె యువరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జక్కుల పరమేశ్ తెలిపారు.